RNI NO. APTELL/ 2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 275 శుక్రవారం 21 ఆగష్టు 2026 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ krk7018@gmail.com పేజీలు :4 రూ॥ 1/-


## రూపారెడ్డి హత్య కేసులో నిందితుల విలాసవంతమైన జీవనశైలి

తెలంగాణలోని నల్గొండలో, 48 ఏళ్ల పాఠశాల ప్రిన్సిపాల్ సంచలనాత్మక హత్య కేసును పోలీసులు ఛేదించి, డబ్బు, విలాసవంతమైన జీవనశైలి కోసం ఈ నేరానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు విద్యార్థులను అరెస్టు చేశారు. కొండమల్లెపల్లిలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్‌గా ఉన్న కల్లు రూపారెడ్డి, ఆగస్టు 12వ తేదీ ఉదయం తన నివాసంలో 27 కత్తిపోట్లతో శవమై కనిపించారు. హైదరాబాద్‌లో ఉన్న ఆమె భర్త, తన ఫోన్ కాల్స్‌కు ఆమె స్పందించడం లేదని ఇరుగుపొరుగు వారికి చెప్పడంతో ఆమె మృతదేహం లభ్యమైంది.

## ఈ–సెట్ తొలగించే ఆలోచన లేదన్న మంత్రి వివేక్..!

తెలంగాణలో పాలిటెక్నిక్ విద్య, ఇంజనీరింగ్ ప్రవేశాల గురించి జరుగుతున్న వదంతులపై రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి స్పష్టతనిచ్చారు. పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ స్కిల్స్ కోసం మారుస్తున్నప్పటికీ, ఈసెట్ ద్వారా బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశాలు పొందే లాటరల్ ఎంట్రీ విధానంలో ఎలాంటి మార్పు ఉండదని, దానిని తొలగించే ఆలోచనే లేదని తేల్చిచెప్పారు.

### సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం..

# నాకేం సంబంధం?

## కొండా సురేఖ వివరణ



### నన్ను బాధ్యురాలిని చేయడం సరికాదు

### పీసీసీ నోటీసులపై కొండా సురేఖ వివరణ

### టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి లేఖ

### కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీకి రిప్లయ్

కొండా సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, తనకేం సంబంధం లేదని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీకి లేఖలో వివరణ ఇచ్చారు. తన కూతురు చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదన్నారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలపై తనకు పీసీసీ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో గురువారం (ఆగస్టు 20) కొండా సురేఖ క్రమశిక్షణ కమిటీకి లేఖ రూపంలో క్లారిటీ ఇచ్చారు. సుస్మిత వ్యక్తిగత అభిప్రాయాలకు తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కుటుంబ బాంధవ్యం కారణంగా ఒకరి వ్యక్తిగత వ్యాఖ్యలకు మరొకరిని రాజకీయంగా బాధ్యులను చేయడం న్యాయ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సుస్మిత వ్యాఖ్యల వెనక తన ప్రమేయం లేదని గుర్తించాలని తనకు జారీ చేసిన నోటీసును వెంటనే ఉపసంహరించుకోవాలని లేఖలో కోరారు. పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందన్నారు.

# నదీ జలాలపై ఏకపక్ష నిర్ణయాలొద్దు..

## అన్ని రాష్ట్రాలకూ ఒకటే రూల్..



కేంద్ర రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే సహకార సమాఖ్యవాద స్ఫూర్తి అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భిన్నమైన ప్రయోజనాలు ఎదురైనప్పుడు కూడా న్యాయబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనగలగడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అని ఆయన పేర్కొన్నారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో ఆయన తెలంగాణ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహాబలిపురంలోని చారిత్రక కట్టడాలను ప్రస్తావించారు. బలమైన నిర్మాణానికి ప్రతి భాగం ఒకేలా ఉండాల్సిన అవసరం లేదని, ప్రతి భాగం తన వంతు భారాన్ని మోయాల్సి ఉంటుందని అన్నారు. భారత సమాఖ్య వ్యవస్థ కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని పేర్కొన్నారు. భిన్నమైన ప్రయోజనాలను న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా, సమర్థవంతంగా సమన్వయం చేయగల సంస్థలు

## 'కళ్యాణలక్ష్మి, షాదీముబారక్'పై

# తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం.

తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాలపై విచారణ సందర్భంగా కోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు స్టే ఎత్తివేతకు నిరాకరించింది. ఈ పథకాలకు చట్టబద్ధమైన ఆధారం ఏంటి? అని ప్రశ్నించింది. ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా ప్రజాధనాన్ని సంక్షేమ పథకాలకు వినియోగించడం ఎంతవరకు సమంజసమని న్యాయస్థానం ప్రశ్నించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపైనా కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. డేంజర్ బెల్స్ మోగుతు న్నాయని హెచ్చరించింది. ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు అందక చాలామంది అవస్థలు పడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో భారీగా ప్రజాధనం ఖర్చు చేసే పథకాల ప్రాధాన్యతను పరిశీలించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. వాస్తవానికి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఈ రెండు పథకాలు 2014లో ప్రారంభమయ్యాయి.



తదుపరి విచారణ సోమవారానికి వాయిదా

స్టే ఎత్తివేతకు నిరాకరించిన తెలంగాణ హైకోర్టు

డేంజర్ బెల్స్ మోగుతున్నాయని హెచ్చరిక

## జీవో 97 VS పాలిటెక్నిక్ స్టూడెంట్స్..

### రంగంలోకి కేటీఆర్..

### ప్రభుత్వానికి స్ట్రాంగ్ వార్నింగ్!



జీవో 97 కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులు చేస్తున్న పోరాటానికి పూర్తి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ఈ మేరకు మీడియా ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ తప్పుడు నిర్ణయం వల్ల వేలాదిమంది పాలిటె క్నిక్ విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసనను తెలుపుతున్న విద్యార్థుల మీద కొన్ని చోట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించిన దృశ్యాలు తనను కలిచి వేశాయని కేటీఆర్ పేర్కొన్నారు. విద్యార్థు ల హక్కులను కాలరాయొద్దని కాంగ్రెస్ ప్రభు త్వాన్ని హెచ్చరించారు. చేస్తున్నట్లు తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జీవో 97 ను వెనక్కి తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే పలు నిరసన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొని విద్యార్థులకు మద్దతు తెలిపారన్నారు. ఇకముందు కూడా పాలిటెక్నిక్ విద్యార్థుల పోరాటానికి అన్ని విధాలుగా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉ ంటుందని స్పష్టం చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం జరిగేవరకూ బీఆర్ఎస్ అండగా ఉంటుందని వారిలో భరోసాను నింపారు.

## పోలీస్, ఫైర్, జైళ్ల శాఖల్లో 7,437 కానిస్టేబుల్, SI ఉద్యోగాలు..

### ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం! డైరెక్ట్ లింక్ ఇదిగో




తెలంగాణలో పోలీసు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ కీలక అప్‌డేట్ జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల్లో మొత్తం 7,437 పోలీసు పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ తాజాగా ప్రారంభమైంది. అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 9, 2026వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

## అంబేద్కర్ టవర్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్!

హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ టవర్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.108 కోట్లతో అంబేద్కర్ టవర్ నిర్మాణానికి పరిపాలనా శాఖ అనుమతిచ్చింది. ప్రస్తుత అంబేద్కర్ భవన్ స్థానంలో 1 సెల్లార్ ం గ్రౌండ్ ం 10 అంతస్తులతో కొత్త టవర్ ఉంది. 12 ఏళ్లుగా వినియోగంలో లేని పాత అంబేద్కర్ భవన్ పాత భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్త టవర్ నిర్మాణానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్అండ్‌బీ అధికారులు భవన పరిస్థితిపై సమగ్ర సర్వే నిర్వహించి రూ.108 కోట్ల అంచనా వేసారు. దీంతో కొత్త టవర్ కోసం ఆర్కిటెక్చరల్, స్ట్రక్చరల్ కన్సల్టెన్సీ సేవలు ప్రభుత్వం తీసుకోనుంది. 2026--27 బడ్జెట్‌లో ఇప్పటికే రూ.25 కోట్లను సర్కర్ కేటాయించింది.

## పంచాయితీలు తీరవు

# ప్రాబ్లమ్స్ ఆగవు

## కాంగ్రెస్ పార్టీలో ముదురుతున్న వర్గపోరు!

బహిరంగంగా వ్యాఖ్యలు..
వరసగా తిరుగుబాట్లు..
నేతల ఓపెన్ కామెంట్స్..
కొండా సురేఖ కుమార్తే..
అంతర్గతంగా
సతమతమవుతున్న లీడర్లు..
నోటీసులకే
పరిమితమవుతున్న
క్రమశిక్షణా కమిటీ..
సీఎంను కార్నర్ చేస్తూ..

ప్రభుత్వాన్ని నడిపిస్తున్న కాంగ్రెస్ పార్టీకి సొంత నేతల నుంచే ముప్పు పొంచి ఉందా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తున్నది. సొంత పార్టీ నేతలే ప్రతిపక్ష లీడర్ల తరహాలో వ్యవహరించడం ఇప్పుడు హస్తం పార్టీ ని ఇరకాటంలో పడేస్తుంది. ఎన్నికలకు సరిగ్గా రెండేళ్ల ముందే పార్టీలో లుకలుకలు, అలజడులు సంభవిస్తు న్నాయి. కీలకమైన రాజకీయం నడుస్తున్న వేళ పార్టీలో ఊహించని పరిణామాలు అలజడులు సృష్టిస్తున్నాయి. "రోజుకో నేత తిరుగుబాటు బావుటా ఎగురవేయడంతో పాటు పూటకో ఆరోపణల పరంపర ఆ పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టేస్తుంది. ప్రభుత్వం, ముఖ్యమంత్రి లక్ష్యంగా పార్టీలోని ప్రముఖ నేతలే బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తుం డటంతో అధిష్టానానికి కూడా ఏం చేయాలో అర్థం కాని పరిస్థితులు ఉ న్నాయి. మొన్న రాజగోపాల్. నిన్న చిన్నారెడ్డి, తాజాగా కొండా సుస్మిత ఇలా కీలక లీడర్లే పార్టీ, ప్రభుత్వాలను తప్పుపట్టడంతో కేడర్ లోనూ తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయి.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం...
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
21 -08-2026

## సంపాదకీయం

# శెట్టిపల్లి భూ సమస్య... పి.జి.ఆర్.ఎస్ డొల్లతనం...

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పి.జి.ఆర్.ఎస్ )లో వచ్చిన నసమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించడమే లక్ష్యం' అంటూ ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ చెప్పే మొదటి మాట. అయితే శెట్టిపల్లి బాధితుల భూ సమస్యపై ఇప్పటికి 40 పర్యాయాలు ఫిర్యాదు చేసినా పరిష్కారం కాకపోవడం పి.జి.ఆర్.ఎస్ డొల్లతనాన్ని తెలియజేస్తుంది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల సమస్యలను నిర్దిష్ట సమయంలో పరిష్కరిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ నుంచి క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. సమస్య పరిష్కారం కోసం ఉన్నతాధికారుల పర్యవేక్షణ, ఫోన్ ద్వారా సమీక్షలు, ఐ.వి.ఆర్.ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ వంటి చర్యలు చేపడుతున్నామని ప్రభుత్వం చెబుతోంది.? అయితే తిరుపతి అర్బన్ మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు బాధితుల భూ సమస్య మాత్రం పి.జి.ఆర్.ఎస్ వ్యవస్థలోని వాస్తవ పరిస్థితిని ప్రశ్నిస్తోంది. 2023 నుంచి ఇప్పటి వరకు సుమారు 40 పర్యాయాలు పి.జి.ఆర్.ఎస్ లో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. 2023లోనే ప్రొసీడింగ్ కు మార్గం సుగమం చేసిన అధికారులు శెట్టిపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 468/1, 468/3, 468/5, 468/6లో మొత్తం 2 ఎకరాల 36 సెంట్ల భూమి వార్తల సుబ్బమ్మ, పి.డి. లక్ష్మమ్మలకు వారసత్వంగా సంక్రమించింది. 2008లో సంబంధిత రిజిస్ట్రార్ పత్రాల ద్వారా భూమి హక్కులు వారి వారసులకు బదిలీఅయ్యాయి. అప్పటి నుంచి భూముల సంబంధిత వారసుల అనుభవంలో ఉన్నాయని బాధితులు చెబుతున్నారు. శెట్టిపల్లి గ్రామంలో భూముల హక్కులు, అనుభవదారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి, అర్హులైన హక్కుదారులు, అనుభవదారుల వివరాలను నమోదు చేసి, వాటిని ప్రజలకు తెలియజేసే విధంగా ప్రచురించారు. ఈ వివరాల్లోనూ బాధితుల పేర్లు ఉన్నాయని వారు పేర్కొంటున్నారు.

అంతేకాకుండా, 2023 డిసెంబరులో అప్పటి తిరుపతి అర్బన్ తహసీల్దార్ ఈ భూములకు ప్రొసీడింగ్ మంజూరు చేయవచ్చని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఎండార్స్‌మెంట్ ద్వారా సిఫార్సు చేసినట్లు బాధితులు చెబుతున్నారు. అలాంటప్పుడు ఇప్పటివరకు ప్రొసీడింగ్ ఎందుకు మంజూరు కాలేదన్నదే ప్రధాన ప్రశ్నగా మారింది. ఈ భూములకు సంబంధించి హైకోర్టులో దాఖలైన రిట్ పిటిషన్లో టి.మునిరత్నమ్మకు సంబంధించిన సర్వే నంబర్ 468/8 లోని 44 సెంట్ల భూమితో పాటు, ఆమెకు సంబంధం లేదని బాధితులు చెబుతున్న 468/1, 3, 5, 6 సర్వే నంబర్లను కూడా ప్రస్తావించినట్లు వారు పేర్కొంటున్నారు . భూమి వివాదాలకు సంబంధించి కేసులు నమోదైన నేపథ్యంలో ఈ వ్యవహారం హైకోర్టు పరిధిలోకి వెళ్లింది. అయితే, 2023 నుంచి 2026 వరకు సంబంధిత వాస్తవాలను పూర్తిస్థాయిలో కోర్టు దృష్టికి తీసుకెళ్లడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలమైందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో తమకు సంబంధం ఉన్న సర్వే నంబర్ 468/8లోని 44 సెంట్ల భూమికి ప్రొసీడింగ్ మంజూరు చేయగా, అదే రిట్ పిటిషన్లో పేర్లు లేని తమకు సంబంధించిన సర్వే నంబర్లకు మాత్రం ప్రొసీడింగ్ ఎందుకు ఇవ్వడంలేదని ఐదుగురు బాధితులు ప్రశ్నిస్తున్నారు.?

కోర్టు కేసు పెండింగ్ లో ఉందనే కారణంతో బాధితులకు ప్రొసీడింగ్ ఇవ్వడం సాధ్యం కాదని ప్రస్తుత రెవెన్యూ అధికారులు నివేదికలు ఇస్తున్నారని వారు చెబుతున్నారు. అయితే, గతంలో ఇదే రెవెన్యూ యంత్రాంగం సంబంధిత భూములపై విచారణ జరిపి ప్రొసీడింగ్ మంజూరుకు అనుకూలంగా నివేదిక ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుత వైఖరిలో మార్పుకు కారణం ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. ఒకవైపు కోర్టు కేసు ఉందని చెబుతూ ప్రొసీడింగ్ నిరాకరిస్తూ, మరోవైపు అదే వివాదానికి సంబంధించిన వ్యక్తికి ప్రొసీడింగ్ మంజూరు చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

? బాధితులు 2023 నుంచి ఇప్పటి వరకు సుమారు 40 పర్యాయాలు పి.జి.ఆర్.ఎస్ లో ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ప్రతి ఫిర్యాదుపై సంబంధిత అధికారులు నివేదికలు సమర్పిస్తున్నప్పటికీ, అసలు సమస్య మాత్రం అలాగే ఉండిపోతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పి.జి.ఆర్.ఎస్ లో ఫిర్యాదు చేసిన ప్రతిసారీ జిల్లా స్థాయి, ఉన్నత స్థాయి అధికారులు సమస్యను పరిశీలిస్తున్నారని, బాధితుల వాదనలో వాస్తవం ఉందని చెప్పినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం సమస్య పరిష్కారం కాకపోవడం అధికార యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రజాసమస్యల పరిష్కార వేదికకు పదేపదే ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాకపోతే, ఆ వ్యవస్థ లక్ష్యం ఏమిటన్నది ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉంది.? రైతుల భూములను వారికి అప్పగిస్తూ , ఉపయోగించని భూములను ప్రజాప్రయోజనాలకు వినియోగించే దిశగా ప్రభుత్వం 'అన్‌లాక్  ది వెల్త్'(సంపద విడుదల) కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రచారం చేస్తోంది. వేల కోట్ల రూపాయల విలువైన భూములను హక్కుదారులకు అందుబాటులోకి తీసుకు వస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది.? అయితే, తమ హక్కులకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, రిజిస్టర్ పత్రాలు, అనుభవం ఉన్నప్పటికీ సంవత్సరాలుగా ప్రొసీడింగ్ కోసం తిరుగుతున్న శెట్టిపల్లి బాధితుల సమస్య ఈ ప్రచారానికి భిన్నమైన వాస్తవాన్ని చూపుతోంది. సర్వే నంబర్లు, రెవెన్యూ రికార్డులు, రిజిస్టర్ పత్రాలు, గతంలో అధికారులు ఇచ్చిన నివేదికలు అన్నింటినీ సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. కోర్టు పరిధిలో ఉన్న అంశం ఏది? దానికి సంబంధంలేని సర్వే నంబర్లను ఎందుకు నిలిపివేశారు? 2023లో ప్రొసీడింగ్ మంజూరుకు? అనుకూలంగా ఇచ్చిన ఎండార్స్‌మెంట్ ఇప్పుడు ఎందుకు మారింది? ఒక వ్యక్తికి ప్రొసీడింగ్ ఇచ్చి, అదే వ్యవహారంలో ఇతర హక్కుదారులకు ఎందుకు ఇవ్వలేదు? ఈ ప్రశ్నలకు రెవెన్యూ అధికారులు ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలి. ప్రజా సమస్యల పరిష్కార వేదికను కేవలం ఫిర్యాదులు స్వీకరించి, నివేదికలు తయారుచేసే? వ్యవస్థగా కాకుండా ప్రజలకు వాస్తవంగా న్యాయం అందించే వేదికగా మార్చాలి.?

# తెలంగాణలో మరో కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే:మంత్రి



హైదరాబాద్ నుంచి రామగుండం వరకు నూతన గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపినట్లు తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రతిపాదిత రహదారిలో సుల్తానాబాద్ బైపాస్‌ను కూడా చేర్చి మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మంథని నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ఇప్పటికే రూ.800 కోట్లకు పైగా నిధులు కేటాయించామని, పనులన్నింటినీ రాబోయే 18 నెలల్లో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రేపల్లి గ్రామంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబుతో కలిసి రూ.384 కోట్ల విలువైన హ్యామ్  , నాన్-ప్లాన్ రోడ్డు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పరిశ్రమల విస్తరణ, వ్యాపార పురోగతి, యువతకు ఉపాధి అవకాశాలు పెరగడానికి నాణ్యమైన రహదారులు అత్యంత కీలకమని మంత్రులు పేర్కొన్నారు. ఆర్అండ్‌బీ , పంచాయతీ రాజ్ శాఖల పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా రూ.30 వేల కోట్లతో రహదారుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం సుమారు రూ.40 వేల కోట్ల విలువైన బిల్లులను పెండింగ్‌లో పెట్టినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందని వెల్లడించారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, గత పదేళ్లలో పెద్దపల్లి జిల్లాలో కేవలం రూ.900 కోట్ల రోడ్డు పనులు మాత్రమే జరిగాయని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ సమయంలోనే రూ.1,700 కోట్ల విలువైన పనులను మంజూరు చేసిందని తెలిపారు. గతంలో నిధులు వెనక్కి వెళ్లిన పెద్దపల్లి బైపాస్ ప్రాజెక్టును రూ.150 కోట్ల అంచనా వ్యయంతో తిరిగి ప్రారంభించామని, ఇప్పటికే రూ.80 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. వచ్చే ఏడాది నాటికి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి బైపాస్ రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మౌలిక వసతుల రూపురేఖలను మార్చడమే లక్ష్యంగా మంథని, సుల్తానాబాద్ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నట్లు మంత్రులు వెల్లడించారు.

## కొండా సుస్మిత వ్యాఖ్యలపై సీరియస్.. లైన్ దాటితే చర్యలు తప్పవు.. కొండా సురేఖకు టీపీసీసీ హెచ్చరిక

## కొండా సుస్మిత వ్యాఖ్యల ఖండన క్రమశిక్షణ దాటితే కఠిన చర్యలు వివరణ కోరిన కాంగ్రెస్ నాయకత్వం

కాంగ్రెస్ పార్టీలో ఎంతటి వారైనా పార్టీ క్రమశిక్షణకు లోబడి పనిచేయాల్సిందేనని, లైన్ దాటితే కఠిన చర్యలు తీసుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్  స్పష్టం చేశారు. నిజామాబాద్ వేదికగా మాట్లాడిన ఆయన, కొండ సుస్మిత చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. సీనియర్ నాయకురాలు కొండ సురేఖ సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నారని గుర్తుచేస్తూ, ఈ వ్యవహారంలో ఇప్పటికే ఆమెకు వివరణ కోరడం జరిగిందని తెలిపారు. పార్టీ నియమావళిని అతిక్రమిస్తే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి తప్పులు జరిగినా వెంటనే సరిదిద్దుకుంటామని స్పష్టం చేస్తూ, అధికారుల పొరపాటు వల్ల జరిగిన తప్పిదాన్ని ఇప్పటికే సవరించామని తెలిపారు. ప్రతిపక్షాలు కావాలనే గత 22 రోజులుగా ఈ అంశంపై రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నేత చిన్నారెడ్డికి కూడా పార్టీ వివరణ కోరిందని వెల్లడించారు. అంతేకాకుండా, సంబంధిత రెవెన్యూ మంత్రి కూడా తన పొరపాటును అంగీకరించారని ఆయన మీడియాకు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలలో వైవిధ్యం ఉన్నప్పటికీ ఎలాంటి వేర్వేరు రంగులకు తావులేదని మహేష్ కుమార్ గౌడ్ నొక్కిచెప్పారు. ఒక్కసారి పార్టీ సభ్యత్వం తీసుకున్న తర్వాత ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ నాయకత్వం కిందకే వస్తారని, పార్టీ ఛత్రఛాయల్లోనే కొనసాగాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నాయకులు ఎవరైనా సరే వ్యక్తిగత అజెండాలను పక్కనపెట్టి పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలని ఈ సందర్భంగా సూచించారు.

## నదీ జలాలపై ఏకపక్ష నిర్ణయాలొద్దు..

ఉండటమే నిజమైన సమాఖ్యవాదమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ప్రతిభ కోసం రాష్ట్రాల మధ్య పోటీ సహజమేనని ఆయన చెప్పుకొచ్చారు. నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపారాలకు రాష్ట్ర సరిహద్దులు అడ్డంకులు కావని డిప్యూటీ సీఎం చెప్పారు. సమస్యలు.. రాష్ట్ర సరిహద్దులను ప్రభుత్వ ఫైళ్ల కంటే వేగంగా దాటుతాయి భట్టి చమత్కరించారు.

## 'కళ్యాణలక్ష్మి, షాదీముబారక్'పై  తెలంగాణ హైకోర్టు

పథకాలపై విచారణ సందర్భంగా ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేసి వచ్చే ఆదాయంతో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టే మార్గాలను కోర్టు ప్రస్తావించింది.  ప్రజల టాక్స్‌లతో వచ్చే డబ్బులు ఉచిత పథకాలకు వాడటం న్యాయమేనా? అని ప్రశ్నించింది. భూసేకరణలో భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం చెల్లింపులపై కూడా న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో సమర్పించిన అఫిడవిట్‌పై కూడా కోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పథకాల చట్టబద్ధత, ప్రభుత్వ ఉత్తర్వులు, నిధుల వినియోగంపై స్పష్టత కోరుతూ తెలంగాణ హైకోర్టు తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

## పోలీస్, ఫైర్, జైళ్ల శాఖల్లో 7,437 కానిస్టేబుల్, SI ఉద్యోగాలు..

తెలంగాణ పోలీసు నియామక మండలి గత నెలలో పోలీసు ఉద్యోగాలకు సంబంధించి నాలుగు నోటిఫికేషన్లను విడుదల చేసింది. సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్ , స్పెషల్ పోలీస్, జైళ్లు, ఫైర్ తదితర విభాగాల్లో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు.

విభాగాల వారీగా ఖాళీల వివరాలు..

**పోలీసు శాఖలో పోస్టులు**

సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్) పోస్టుల సంఖ్య: 148
రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (AR) పోస్టుల సంఖ్య: 14
రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (TGSP) పోస్టుల సంఖ్య: 12
రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (SAR CPL) పోస్టుల సంఖ్య: 3
అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (FBP) పోస్టుల సంఖ్య: 23
పోలీస్ కానిస్టేబుల్ (సివిల్) పోస్టుల సంఖ్య: 3,697
పోలీస్ కానిస్టేబుల్ (AR) పోస్టుల సంఖ్య: 1052
పోలీస్ కానిస్టేబుల్ (SAR CPL) పోస్టుల సంఖ్య: 24
పోలీస్ కానిస్టేబుల్ (డ్రైవంY--PTO) పోస్టుల సంఖ్య: 20
పోలీస్ కానిస్టేబుల్ (మెకానిక్--PTO) పోస్టుల సంఖ్య: 7
స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (SPF)లో పోస్టులు
**సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల సంఖ్య: 44**
కానిస్టేబుల్ పోస్టుల సంఖ్య: 1380
ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం పోస్టులు
స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పోస్టుల సంఖ్య: 39
ఫైర్ ఫైటర్ పోస్టుల సంఖ్య: 751

**జైళ్ల శాఖలో పోస్టులు**

డిప్యూటీ జైలర్ (పురుషులు) పోస్టుల సంఖ్య: 14
డిప్యూటీ జైలర్ (మహిళలు) పోస్టుల సంఖ్య: 1
వార్డర్ (పురుషులు) పోస్టుల సంఖ్య: 196
వార్డర్ (మహిళలు) పోస్టుల సంఖ్య: 12

ఈ పోస్టులకు సంబంధించిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగస్టు 19 నుంచి ప్రారంభమైంది. అభ్యర్థులు అక్టోబర్ 9, 2026లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునే ముందు అభ్యర్థులు తమ విద్యార్హతలు, వయోపరిమితి, శారీరక ప్రమాణాలు, ఇతర అర్హతలను సంబంధిత నోటిఫికేషన్‌లో పరిశీలించుకోవల్సి ఉంటుంది. పోలీసు ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియలో రాత పరీక్షతో పాటు పోస్టును బట్టి శారీరక సామర్థ్య పరీక్ష , శారీరక కొలతల పరీక్ష , తదితర దశలు ఉండే అవకాశం ఉంది. కాబట్టి అభ్యర్థులు సంబంధిత పోస్టుకు సంబంధించిన పూర్తి నోటిఫికేషన్‌ను చదివి, ఎంపిక విధానం, సిలబస్, పరీక్ష విధానం తదితర వివరాలను తెలుసుకోవాలి. అలాగే పోస్టుల వారీగా అర్హతలు, వయోపరిమితి, ఫీజు, పరీక్ష విధానం, శారీరక ప్రమాణాలు, దరఖాస్తు విధానం వంటి వివరాలు వేర్వేరుగా ఉండొచ్చు. అభ్యర్థులు TGPRB అధికారిక నోటిఫికేషన్లను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలి.

## పంచాయితీలు తీరవు  ప్రాబ్లమ్స్ ఆగవు కాంగ్రెస్ పార్టీలో ముదురుతున్న వర్గపోరు!

దీంతో టీపీసీసీ ముఖ్య నేతలు కూడా తలలు పట్టుకో వాల్సి వస్తుంది. గత కొద్ది రోజులుగా పార్టీలోని ప్రముఖుల వైఖరి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వంపై, పార్టీ అంతర్గత నిర్ణయాలపై ముక్కుసూటిగా స్పందిస్తూ నేతలు గుబులు రేపు తున్నారు. మంత్రి పదవి ఆశించి అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత పార్టీ నిర్ణయాలు, మంత్రివర్గ కేటాయిం పులతో పాటు నియోజకవర్గాల్లో ప్రాధాన్యతపై బహిరంగంగానే తన అసంతృప్తిని వెళ్లగక్కారు. ఇక మాజీ మంత్రి డాక్టర్ చిన్నారెడ్డి సీనియర్ నేతగా ఉన్నప్పటికీ, పార్టీ శ్రేణుల పదవుల కేటాయింపుల్లో తనకు ప్రాధాన్యం తగ్గడంపై అధిష్టాన వైఖరిని ఎండగడుతూ ఆవేదన వ్యక్తం చేశారు.  తాజాగా మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయా ల్లో హాట్ టాఫిక్ గా మారాయి. నియోజక వర్గాల పరిధిలో రాజకీయం, పార్టీ నిర్ణయాల విషయంలో తీవ్ర విమర్శ లు గుప్పించడమే కాక, సీఎం రాజకీయాన్ని కార్నర్ చేసే స్థాయి లో ప్రకటనలు చేయడం కాంగ్రెస్ అంతర్గత విభేదాలను బట్టబ యలు చేసింది. ఉమ్మడి జిల్లా మంత్రి లేకుండానే సీఎం ఎలా పర్యటిస్తారని, పరకాల టిక్కెట్ ఎలా ముందే ప్రకటిస్తారం టూ సుస్మిత సూటిగానే సీఎంను నిలదీయడంతో కాంగ్రెస్ పార్టీలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.  బహిరంగంగా మాట్లాడే ధైర్యం ఉన్న కొందరు నేతలు మీడియా ముందుకు వచ్చి విమర్శలు చేస్తుంటే, మరికొందరు సీనియర్లు, నియోజ కవర్గ స్థాయి నాయకులు ఇంటర్నల్ గా తీవ్ర వేదనను అనుభ విస్తున్నట్లు తెలిసింది.  ప్రధా నంగా పార్టీ మారిన వారికి ఇస్తున్న ప్రాధాన్యం కష్టపడ్డ సీనియర్లకు దక్కడం లేదనే కోపం స్పష్టంగా కనిపిస్తోంది.ఇక ప్రభుత్వం ,పార్టీ యంత్రాంగం మధ్య సరైన సమన్వయం లేకపోవడం వల్ల క్షేత్రస్థాయి నేతలు సతమతమవుతున్నారు.గతంలో కూడా అనేక మంది సీనియర్ నేతలు పార్టీకి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా మాట్లాడిన ఘటనలు బోలెడు ఉన్నాయి. పార్టీ కార్యవర్గం, నామినేటెడ్ పదవులు, కమిటీలు ఎంపిక నుంచి మంత్రివర్గ వి విస్తరణ వరకు ప్రతి సందర్భంలోనూ కాంగ్రెస్ లో విమర్శల వర్షం కురుస్తుంది. ప్రజాస్వామ్యం పేరిట చాలా మంది నేతలు ఇంటర్నలగా చర్చించాల్సిన అంశాలను కూడా నేరుగా బహిరంగంగానే తెరమీదకు తీసుకువస్తున్నారు. పార్టీలో ఎలాంటి అసంతృప్తి వచ్చినా క్రమశిక్షణ పాటించాలని ఉపన్యాసాలు ఇచ్చే పార్టీ క్రమశిక్షణా కమిటీ పాత్ర ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.పార్టీ రూల్స్ బ్రేక్ చేస్తూ విమర్శలు చేసే నేతలకు కేవలం వివరణ కొరకు మాత్రమే నోటీసులు ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ?గట్టి చర్యలు తీసుకోలేక పోవడం, నోటీసులు ఇచ్చిన తర్వాత ఆ వ్యవహారాన్ని సర్దుబాటు పేరిట పక్కన పెట్టేయడంతో అసంతృప్త నేతలకు భయం లేకుండా పోతోందనే టాక్ సొంత పార్టీ నేతల్లోనే వినిపిస్తోంది. ప్రభుత్వం సమర్థవంతమైన పాలన అందిస్తున్నామని చెప్తున్నప్ప టికీ, సొంత నేతల నుంచి వస్తున్న ఈ తీవ్రమైన వ్యాఖ్యలు పార్టీ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయి. రోజుకో నేత చేస్తున్న వ్యాఖ్య లు, సీఎంను కార్నర్ చేస్తున్న తీరు రాబోయే కీలక ఎన్నికల వేళ పార్టీ కేడర్‌ను గందరగోళంలోకి నెట్టే ప్రమాదం ఉన్నదని ఎక్స్ పర్ట్స్ చెబుతున్నారు. పంచాయితీలు తీర్చడంలో క్రమ శిక్షణ కమిటీ వైఫల్యం చెందడంతోనే ఇలాంటి సమస్యలు రిపీట్ అవుతున్నాయని పార్టీకి చెందిన ఓ సీనియర్ నాయకుడు సీరియస్ అయ్యారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక





# దేశ అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయం

నిజామాబాద్ సిటీ , ఆగస్టు 20(ప్రజాగళం ): దేశ అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశాభివృద్ధికి చేసిన సేవలను, యువత, సాంకేతిక రంగం, స్థానిక సంస్థలకు అధిక ప్రాధాన్యత కల్పించిన ఆయన దూరదృష్టిని టీపీసీసీ చీఫ్ స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో మేయర్ ఉమారాణి ,డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని రాజీవ్ గాంధీకి నివాళులు అర్పించారు.

# అంతరించిపోతున్న, అడవులతో భావితరాల మనుగడకు ప్రమాదం.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి.
వనమహోత్సవంలో మొక్కలు నాటిన టీపీసీసీ అధ్యక్షులు
ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్.



నిజామాబాద్ ఆగస్టు 20 (ప్రజా గళం): అంతరించిపోతున్న అడవులతో భావితరాల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ శివారులోని మల్లారం గండి ప్రాంతంలో గురువారం వనమహోత్సవ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. వనమహోత్సవంలో భాగంగా మల్లారం గండి వద్ద నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చుని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి , డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ,పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్లాట్ విక్రయంలో మోసం..

# ముగ్గురిపై కేసు, ఒకరి అరెస్ట్

ఆదిలాబాద్ ఆగస్టు 20 : మరో నిందితుడు పరారీలో.. ఇంకొకరిపై పీటీ వారెంట్ దాఖలు చేయనున్న పోలీసులు మావల ఎస్‌హెచ్‌ఓ బీడీ ప్రేమ్ కుమార్ మావల పోలీస్ స్టేషన్ పరిధిలో ప్లాట్ విక్రయం పేరుతో మోసానికి పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు మావల ఎస్‌హెచ్‌ఓ బీడీ ప్రేమ్ కుమార్ తెలిపారు. బట్టిసవర్గావ్ గ్రామానికి చెందిన బాధితుడు 2022లో సర్వే నంబర్ 94/1లోని ప్లాట్ నంబర్ 9ను నిందితుడు అగు మల్లయ్య తదితరుల వద్ద కొనుగోలు చేశాడు. అనంతరం ప్లాట్‌లోని కొంత భాగం సర్వే నంబర్ 94/2లోకి వస్తున్నట్లు గుర్తించి బాధితుడు నిందితులను ప్రశ్నించగా, సమస్య పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో మావల పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 592/2025, సెక్షన్ 420, 34 ఐపీసీ కింద కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడు అగు మల్లయ్య ఏ మల్లయ్య (42)ను ఆగస్టు 20న అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పదిరె పోతారెడ్డి (75) పరారీలో ఉన్నాడు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న నల్ల గణపత్ రెడ్డి (68) ప్రస్తుతం మరో కేసులో జిల్లా జైలులో ఉండగా, అతనిపై పీటీ వారెంట్ దాఖలు చేయనున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. ప్రజలు స్థలాలు, ప్లాట్లు కొనుగోలు చేసే ముందు సంబంధిత పత్రాలు, హద్దులు, అనుమతులు తదితరాలను పూర్తిగా పరిశీలించుకోవాలని సూచించారు.

# 22 ఏ పై బీఅర్ఎస్.అనవసర రాద్ధాంతం.

- పోచారం ఆవేదనను అర్థం చేసుకున్నాం.
- కొండా సుస్మిత వ్యాఖ్యలు బాధాకరం.
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.



నిజామాబాద్ ఆగస్టు 20 (ప్రజాగళం): 22 ఏ పై బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తుందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ నగర శివారులోని మల్లారం గ్రాండీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తాజా రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు. కింది స్థాయిలో జరిగిన తప్పిదం మా దృష్టికి వస్తే లోపాలను సరిదిద్దాలని అధికారులను సీఎం ఆదేశించినట్లు అయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.తప్పిదం జరిగిందని సాక్ష్యతు మంత్రి ప్రకటించి సరిదిద్దుతున్నారని స్పష్టం చేశారు. ఇకమీదట 22 ఏ వల్ల భూదందా, భూముల అన్యాక్రాంతానికి అవకాశం ఉండదని మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.మా ప్రభుత్వం లో సామాన్యులకు అన్యాయం జరిగితే గాంధీ భవన్ తలుపులు తట్టవచ్చని సూచించారు.పోచారం శ్రీనివాస్ రెడ్డి విషయం లో స్పందిస్తూ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు.పోచారం ఇటీవల చేసిన వ్యాఖ్యల పై ఆయన తో మాట్లాడడం జరిగిందన్నారు.

ఆయన ఆవేదన ను అర్థం చేసుకున్నామని, పోచారం ఆవేదన వెనుక బాధ ఉందన్నారు.నామినేటెడ్ పదవుల్లో కాంగ్రెస్ లో సీనియర్ నేతలకు 70 శాతం పదవులు ఇవ్వడం ఖాయమన్నారు. బాన్సువాడ లో పాత కొత్త నేతల కలయిక తో ముందుకు వెళ్తున్నామన్నారు.పోచారం కాంగ్రెస్ సిద్ధాంతాలకు , సంక్షేమానికి మద్దతుగా ఉన్నారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కొండా సుస్మిత వ్యాఖ్యల పై.. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందన. కొండా సుస్మిత వ్యాఖ్యలు బాధాకరం, తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సుస్మిత వ్యాఖ్యల పై మంత్రి కొండా సురేఖ కు షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. కొండా సురేఖ మంత్రి పదవిలో ఉన్నారు కాబట్టి వివరణ కోరడం జరిగింద న్నారు. షోకాజ్ నోటీస్ కు వివరణ ఇచ్చాక తదుపరి చర్య తీసుకోవడం జరుగుతుందన్నారు. చిన్నారెడ్డి సీనియర్ నాయకులు , పార్టీ లైన్ దాటితే క్రమ శిక్షణ చర్యలు తప్పవని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు.అభ్యర్థులను ఎవరు ప్రకటించిన అవి చెల్లవని స్పష్టం చేశారు. పార్టీలో ఓ విధానం ఉంటుందన్నారు. ఎన్నికల కమిటీ, సీడబ్ల్యూసీ నిర్ణయం ప్రకారం అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ గౌడ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ నాయకులు, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# టీబి ముక్త భారత్ పై స్పెషల్ ఆఫీసర్లకు శిక్షణ.





నిజామాబాద్ వైద్య విభాగం ఆగస్టు 20( ప్రజాగళం ): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని క్షయ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో మండల స్థాయి ప్రత్యేక అధికారులకు టిబి ముక్తభారత్ అభియాన్ పై ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఐడిఓ సి సమావేశ మందిరంలో గురువారం నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి. రాజశ్రీ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ భవేష్ మిశ్రా, అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు ఇచ్చే పోషకాహార పారితోషము (డిబిటి) ను జనవరి నుండి జూన్ వరకు మంజూరైన నిధులను 100% పూర్తి చేయాలన్నారు, జిల్లాలో ఇప్పటివరకు కేవలం 47% మాత్రమే పూర్తి చేసినందున మిగతాది త్వరలోనే పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా 126 క్షయ వ్యాధిగ్రస్తులకు ఆధార్ లింకు బ్యాంక్ అకౌంట్ లేనందు వల్ల డిబిటి తిరస్కరించడం జరిగిందని, వారిని కూడా ఆధార్ లింక్ బ్యాంక్ అకౌంట్ లను చేయించి డిబిటిని ఇవ్వాలన్నారు. అన్ని మండలాలలో ఉన్న ప్రత్యేక అధికారుల సహాయ సహకారాలతో స్వచ్ఛంద సేవా సంస్థలను మోటివేట్ చేస్తూ క్షయ వ్యాధిగ్రస్తులకు ఫుడ్ బాస్కెట్లు ఇచ్చే లాగా చూడాలన్నారు. క్షయ వ్యాధి పై వివరణత్మకమైన సమాచారం కంటే క్షేత్రస్థాయిలో సాధించిన లక్ష్యం, ఎదురైన అవరోధాలను దృష్టిలో ఉంచుకొని మిగతా లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి. రాజశ్రీ మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం 975 క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, ప్రతి మండలంలో ఉన్న స్పెషలాఫీసర్, ఐదుగురు ఎన్సిసి వాలంటీర్లు, ఐదుగురు మేరా యువ భారత్ వాలంటీర్లతో కలిపిఆ మండలంలో ఉన్న క్షయ వ్యాధిగ్రస్తుల పై దృష్టి సారించాలన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి ఒక క్షయ వ్యాధిగ్రస్తుడికి పోషకాహార కిట్టును ఇచ్చేలా ప్రోత్సహించాలన్నారు. టీబీ ఎంబీఏ 1.0 2025లో జనవరి నుండి జూన్ వరకు 97% చికిత్స పూర్తయిందని అన్నారు. నిక్షయ్ పోర్టల్ ను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, నిక్షయ్ మిత్ర లో సైకో సోషల్ మిత్ర, న్యూట్రిషన్ సపోర్ట్ మిత్ర, డయాగ్నోసిస్ సపోర్ట్ మిత్ర గా నమోదు చేయాలన్నారు. ఆ తర్వాత క్షయ వ్యాధికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని పిపిటి ద్వారా డిటిసిఓ డాక్టర్ దేవీ నాగేశ్వరి చెప్పడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎపిడి సాయన్న, జడ్పీ సీఈవో సాయాగౌడ్, డిఐఓ డాక్టర్ అశోక్, జిల్లా ఉప వైద్యాధికారి నిజామాబాద్ డివిజన్ డాక్టర్ సికందర్ నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ సుప్రియ డాక్టర్ వెంకటేష్ డాక్టర్ నవ్య, వివిధ మండలాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్ లకు అధికారాలు ఇవ్వాలి.



- చెక్ పవర్ ను మార్చొద్దు, స్టాండింగ్ కమిటీలలో ప్రాధాన్యత ఇవ్వాలి.
- ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్

నిజామాబాద్ సిటీ , ఆగష్టు 20 (ప్రజాగళం ): ఉప సర్పంచ్‌లకు అధికారం ఇస్తూ స్టాండింగ్ కమిటీలలో ప్రాధాన్యత కల్పించాలని ఉపసర్పంచ్ ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సందీప్ గార్డెన్ లో కామారెడ్డి నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఉప సర్పంచుల ఫోరం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ మాట్లాడుతూరాష్ట్ర వ్యాప్తంగా ఉపసర్పంచులకు గౌరవ వేతనం కల్పిస్తూ,ప్రారంభోత్సవాల శిలాఫలకాల మీద పేర్లు పెట్టాలని , స్టాండింగ్ కమిటీలలో వైస్ చైర్మన్ హటరీదా ఇవ్వాలని డిమాండ్ చేశారుగ్రామ పంచాయతీలలో ప్రజాస్వామ్యం పారదర్శకత, సమిష్టి బాధ్యత అమలు కోసం పలు అధికారాలు కల్పించబడ్డాయన్నారు.ముఖ్యంగా చటంలోని సెక్షన్ 38 ప్రకారం సర్పంచ్ గైర్హాజరైనప్పుడు లేదా పదవి ఖాళీ అయినప్పుడు, విధులు నిర్వహించలేని పరిస్థితులలో ఉప సర్పంచ్ కు సర్పంచ్ అధికారాలు వినియోగించుకునే హక్కు కల్పించబడినదన్నారు . ఈ విధానం వలన గ్రామపంచాయతీలో అవినీతి నియంత్రణ బాధ్యతాయుత పాలన, ప్రజాధనం సరైన వినియోగం సాధ్యమవుతుందన్నారు. ఉపసర్పంచ్ లు,వార్డు మెంబర్లు కూడా ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులేనని .ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు, పంచాయతీ పరిపాలనలో వారు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు.అయినగాని వారు నిర్వహిస్తున్న సేవలకు తగిన గౌరవ వేతనం లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఉపసర్పంచ్లకు 5000/-,వార్డు సభ్యులకు 3000/- రూపాయలను ప్రభుత్వం గౌరవ వేతనంగా కల్పించాలని రాష్ట్ర ఫోరమ్ తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అదే విధంగా గ్రామపంచాయతీ తీర్మానాల పత్రాల మీద ఉపసర్పంచ్ లకు కూడా సంతకం చేసే హక్కు కల్పించాలన్నారు.

శిలాఫలకాల మీద ఉపసర్పంచ్ ల పేర్లు చేర్చాలన్నారు.అంతేకాక మండల స్థాయిలో జరిగే సర్వసభ్య సమావేశాలకు ఉపసర్పంచ్ లను ఆహ్వానించాలని, గ్రామ పంచాయతీలోని వివిధ స్టాండింగ్ కమిటీలలో సర్పంచ్ ను చైర్మన్ గా గుర్తించినప్పుడు,ఉపసర్పంచ్ ను వైస్ చైర్మన్ గా గుర్తించాలన్నారు.దీనివలన గ్రామ పాలనలో సమిష్టి బాధ్యత పారదర్శకత, ప్రజాస్వామ్య విధానం మరింత బలోపేతం అవుతాయన్నారు.గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ లకు ఎంత బాధ్యత ఉందో ఉప సర్పంచ్ లకు అంతే బాధ్యత ఉందన్నారు.. ఉపసర్పంచ్ కు అధికారాలు, గౌరవవేతనం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప సర్పంచ్ ల ఫోరమ్ ఉపాధ్యక్షులు వికార్ పాషా,జిల్లా ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు మహేష్, జిల్లాలోని వివిధగ్రామాల ఉపసర్పంచులు , నాయకులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
21 -08-2026



# సీఎం రేవంత్ విదేశీ పర్యటనలపై ధర్మపురి అర్వింద్ విమర్శలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్న విదేశీ పర్యటనల వెనుక ఉన్న ఉద్దేశాలపై నిజామాబాద్ బీజేపీ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రానికి కార్పొరేట్ పెట్టుబడులను తీసుకువచ్చే పేరుతో సీఎం చేస్తున్న పర్యటనలన్నీ భారత్ దేశంపై వ్యతిరేక భావజాలం, విద్వేషం చిమ్మే వర్గాలతోనే సాగుతున్నాయని ఆయన ఆరోపించారు. అంతర్జాతీయంగా భారత్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్న జార్జ్ సోరోస్ వంటి వ్యక్తులు మరియు సంస్థల నిధులతో నడిచే వేదికల వద్దకే ముఖ్యమంత్రి వెళుతున్నారని ఎంపీ అర్వింద్ విమర్శించారు. దేశ వ్యతిరేక భావజాలం కలిగిన ఇటువంటి సంస్థలను సీఎం కలవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలోని ఐఏఎస్ మరియు ఐపీఎస్ అధికారులను ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి పలువురు అధికారులు చివరకు జైలుపాలు కావాల్సి వచ్చిన ఉదాహరణలను ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల అధికారులకు ఎటువంటి చట్టపరమైన రక్షణ ఉండదని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కేంద్రంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ధర్మపురి అర్వింద్ స్పష్టం చేశారు. రాబోయే 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ భారీ మెజారిటీతో విజయం సాధించి అధికారంలోకి రావడం అక్షరాలా సత్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# స్కానింగ్ సెంటర్లపై వైద్యాధికారుల మెరుపు దాడులు.

## నిబంధనలు అతిక్రమించిన స్కానింగ్ సెంటర్ల కు షోకాజ్ నోటీసులు.

నిజామాబాద్ వైద్య విభాగం ఆగస్టు 20 (ప్రజాగళం) జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో బుధవారం, గురువారం స్కానింగ్ సెంటర్లు పలు క్లినిక్ ల పై మెరుపు దాడులు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న సెంటర్లకు, క్లినిక్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిజామాబాద్ నగరంలోని బోధన్ రోడ్డు లో గల పి టి ఎస్ స్కానింగ్ సెంటర్, అహమ్మద్ పుర కాలనీలోని క్లినిక్, నిబంధనలు అతిక్రమించిన స్కానింగ్ సెంటర్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి రాజశ్రీ తనిఖీ చేసి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

పి టి ఎస్ స్కానింగ్ సెంటర్ లో ఓపి రిజిస్టరు, ఫామ్ ఎఫ్ అసంపూర్తిగా ఉండడం, ఆసుపత్రి పరిసరాలు అ పరిశుభ్రంగా ఉండడం, రిఫరల్ ఫామ్స్ ద్వారా నాన్ మెడికల్ వ్యక్తుల చేత రిఫర్ చేయడం , క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ నిబంధనలు అతిక్రమించినందున షోకాజ్ నోటీస్ జారీ చేశారు. అహ్మద్ పుర కాలనీ లోని మరో ఆసుపత్రి క్లినిక్ లో యునాని వైద్యుడు చికిత్స అందించాల్సింది, యునాని పేరు పెట్టి అలోపతి వైద్యం అందిస్తుండడం, ఆసుపత్రిలో అలోపతి మెడిసిన్స్ లభించడం అదేవిధంగా పిల్లల వైద్య నిపుణులు, శ్రీ వైద్య నిపుణుల సేవలు అందుబాటులో ఉన్నట్లు బోర్డును ప్రదర్శించడం తో వాటిని తొలగించడం జరిగింది, ఈ విధంగా నిబంధనలకు విరుద్ధం ఉండడం చేత షోకాజ్ నోటీసు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా గురువారం




బోధన్ రోడ్డులోని హయత్ హాస్పిటల్ యాభై పడకల ఆసుపత్రి తనిఖీ చేశారు. ఈ ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్ స్థలం, ర్యాంపు లేకపోవడం, త్రీ కలర్ కోడెడ్ బిన్స్ ద్వారా చెత్తను, వేస్టేజ్ ను సేకరించకపోవడం, డాక్టర్ కావ్య ప్రత్యక్షంగా లేకపోవడమే కాక డిజిటల్ సంతకాన్ని ఉపయోగించడం, ఓపి రిజిస్టర్ను అర్హతలేని వ్యక్తుల చేత రాయించడం, ఎంటి పీలో రిజిస్ట్రీ కాకుండానే మే 2025 నుండి గురువారం వరకు నిబంధనలకు విరుద్ధంగా మొత్తం 51 ఆపరేషన్లను చేయడం, రికార్డును రిపోర్టులను అసంపూర్తిగా కలిగి ఉండడం, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టి సర్టిఫికెట్ లేకుండానే పిల్లల వైద్య నిపుణుల సేవలను అందించడం, నెలవారి రిపోర్టులను నివేదికలను ఫామ్ ఎఫ్ ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి అందజేయకపోవడం, పి సి పి ఎన్ డి టి కి సంబంధించిన డేటాను గత ఐదు సంవత్సరాల నుండి వారి దగ్గర లేకపోవడం, అసంపూర్తి స్కానింగ్ రిఫరల్ షీట్స్, గడువుతీరిన ఔషధాలు ఆపరేషన్ థియేటర్లో లభించడం తో నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రిని నిర్వహిస్తున్నందున వారికి కూడా షోకాజ్ నోటీసు అందించడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజశ్రీ తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా వైద్యాధికారి తో పాటు ఏవో సుమంత్ కుమార్ , డాక్టర్ సుప్రియ, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ కీర్తన, డి హెచ్ ఈ,వేణుగోపాల్ నాగరాజు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాస్త్రీయ సమాచారాన్ని రైతులకు చేరవేయాలి: నార్మ్ డైరెక్టర్ డా. ఆర్.ఎం. సుందరం





వ్యవసాయ పరిశోధనా సంస్థలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, శాస్త్రీయ అభివృద్ధి, నూతన సాంకేతికతలకు సంబంధించిన సమాచారాన్ని రైతులు, ప్రజలకు సమర్థవంతంగా చేరవేయాల్సిన అవసరం ఉందని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్ ) డైరెక్టర్ డా. ఆర్.ఎం. సుందరం అన్నారు. హైదరాబాద్‌లోని నార్మ్ లో "అగ్రి-మీడియా సినర్జీ: ఎన్‌హాన్సింగ్ కొలాబరేటివ్ కమ్యూనికేషన్" అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డా. సుందరం మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో పరిశోధకులు, రైతులు, ఇతర భాగస్వాముల మధ్య సమాచార అంతరాన్ని తగ్గించేందుకు స్పష్టమైన కమ్యూనికేషన్ విధానం అవసరమన్నారు. వ్యవసాయ పరిశోధనా సంస్థలు అభివృద్ధి చేస్తున్న సాంకేతికతలు, పరిశోధన ఫలితాలను సరైన దృక్పథంతో ప్రజలకు చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. శాస్త్రీయ అంశాలను సరళమైన భాషలో వివరించి, ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా చేయాలని సూచించారు. పారదర్శకత, వ్యూహాత్మక కమ్యూనికేషన్, నూతన ఆలోచనలు సమర్థవంతమైన ప్రజా సమాచారానికి కీలకమన్నారు. బిజినెస్ లైన్ కన్సల్టింగ్ ఎడిటర్ డా. కుర్మనాథ్ ముఖ్య ప్రసంగం చేస్తూ.. శాస్త్రీయ అంశాలపై వార్తలు రాసేటప్పుడు డేటా, గణాంకాలు, వాస్తవాలు, ఇన్ఫోగ్రాఫిక్స్‌ను ఉపయోగించడం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచవచ్చన్నారు. మానవీయ కోణంలో కథనాలను రూపొందించడం వల్ల వాటి ప్రభావం, ప్రజాదరణ మరింత పెరుగుతుందని తెలిపారు. డిజిటల్, ఏఐ ఆధారిత మీడియా వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఫొటోలు, షార్ట్ వీడియోలు, స్పష్టమైన వివరణలతో కూడిన బహుళ మాధ్యమ కమ్యూనికేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నార్మ్ ఎక్స్‌టెన్షన్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్ డివిజన్ హెడ్ డా. వెంకట్ కుమార్ మాట్లాడుతూ.. జాతీయ వ్యవసాయ పరిశోధన, విద్య, విస్తరణ వ్యవస్థలో మానవ వనరుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు నార్మ్ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఐసీఏఆర్ సైన్స్ కమ్యూనికేషన్ పాలసీ ప్రాధాన్యతను వివరించారు. వర్క్‌షాప్‌లో వ్యవసాయ సమాచారాన్ని రైతులకు చేరవేసే విధానాలు, మారుతున్న మీడియా పద్ధతులు, డిజిటల్ కమ్యూనికేషన్, సమాచార వ్యాప్తి వ్యవస్థలు, వ్యవసాయ పరిశోధన సంస్థలు--మీడియా మధ్య వృత్తిపరమైన సహకారం వంటి అంశాలపై చర్చించారు. రైతులు, గ్రామీణ ప్రజల సమాచార అవసరాలను గుర్తించి, విశ్వసనీయమైన, పారదర్శకమైన, సమయానుకూల సమాచారాన్ని అందించాల్సిన అవసరాన్ని పలువురు ప్రతినిధులు వివరించారు. అంతకుముందు నార్మ్ సి టి ఓ , వర్క్‌షాప్ డైరెక్టర్ జి. అనీజా పాల్గొన్న వారికి స్వాగతం పలికి కార్యక్రమం ఉద్దేశాలను వివరించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అగ్రి-బ్యూరో చీఫ్‌లు, సీనియర్ రిపోర్టర్లు, పబ్లిక్ రిలేషన్స్ అధికారులు, కమ్యూనికేషన్ నిపుణులు కలిపి సుమారు 35 మంది వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

# రూ.20 లంచం కేసు.. 30 ఏళ్ల తర్వాత సుప్రీం తీర్పు.. ఉద్యోగుల విడుదల

కేవలం రూ. 20 లంచం తీసుకున్నారనే ఆరోపణపై ముప్పై ఏళ్లుగా సాగిన సుదీర్ఘ న్యాయపోరాటానికి సుప్రీంకోర్టు ఎట్టకేలకు ముగింపు పలికింది. గుజరాత్ ప్రభుత్వంలోని ఒక గుమాస్తా, చప్రాసీపై మోపిన అభియోగాలను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం వారిని నిర్దోషులుగా విడుదల చేసింది. లంచం డిమాండ్ చేసినట్లు సరైన ఆధారాలు లేకుండా కేవలం డబ్బులు చేతులు మారినంత మాత్రాన నేరం నిరూపితం కాదని జస్టిస్ ఉజ్జల్ భూయన్, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌ల బెంచ్ స్పష్టం చేసింది. 1996లో ప్రారంభమైన ఈ కేసులో కింది కోర్టుల తీర్పులను పక్కనపెడుతూ కోర్టు తీర్పునిచ్చింది. ఆనంద్ జిల్లాలోని బెచరి గ్రామ పంచాయతీలో ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం వచ్చిన ఒక విద్యార్థి నుంచి గుమాస్తా రూ. 100, చప్రాసీ రూ. 20 లంచం కోరారని ఏసీబీ కేసు నమోదు చేసింది. అయితే దాడుల్లో చప్రాసీ వద్ద రూ. 20 దొరకగా, గుమాస్తా వద్ద ఎలాంటి సొమ్ము లభించలేదు.

# తాము సొసైటీ డబ్బులు వాడుకున్నట్లు కార్యదర్శి చేసిన ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదు.

- తీవ్రం గా ఖండిస్తున్నట్లు సేల్స్ మెన్లు వెల్లడి..
- కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తున్నాము,
- చేసిన ప్రతి ఆడిట్ రిపోర్ట్ లో తమపై ఎటువంటి అప్పు లేదు. అప్పు మోపడం సరైనది కాదు.
- సేల్స్ మెన్‌లు ఆవేదన..



ఎడపల్లి,ఆగస్టు 20: (ప్రజా గళం) తాము సొసైటీ డబ్బులు సొంతానికి వాడుకుని దుర్వి నియోగం చేసినట్లు సొసైటీ కార్యదర్శి చేసిన ఆరోప ణల్లో ఎటువంటి నిజం లేదని,ఈ సందర్భంగా కార్యద ర్శి ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎడపల్లి సొసైటీ సేల్స్ మెన్లు స్పష్టం చేశారు. తాము నిధులు దుర్వినియోగంకు పాల్పడితే ఉ న్నత అధికారులతో విచారణ జరిపి చర్యలు తీసుకోవచ్చని వారు తెలిపా రు. గురువారం సేల్స్ మెన్లు ప్రభాకర్ గౌడ్, జగన్, బాలు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎడపల్లి ఫర్టిలైజర్ సేల్స్ మెన్ ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ.. తాను సొసైటీ కి 25 లక్షలు అప్పు ఉన్నట్లు కార్యదర్శి రాజారాం అందరికి తెలిపారని, పత్రికలకు చెప్పడం, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని అన్నారు. తాను 2018 నుండి సొసైటీ లో ఉద్యోగం చేస్తున్నానని, ప్రతి సంవత్సరం అధికారులు ఆడిట్ నిర్వహిస్తారని, ఇప్పటి వరకు ఏ ఆడిట్ రిపోర్ట్ లో తాను అప్పు తేలలేదని అన్నారు. 2025 సంవత్సరం వరకు ఎటువంటి డ్యూ లేవని చెప్పడం జరిగింది అని, 2025--2026 కు వచ్చేస రికి 25 లక్షలు అప్పు ఉన్నట్లు కార్యదర్శి చెప్పడం జరి గింది అని అన్నారు. ఆన్ లైన్ రిపోర్ట్ తీసుకుని చూడ గా ఎక్కడ కూడా ఆడిట్ లో అప్పు ఉన్నట్లు లేదని అన్నారు. సొసైటీ పక్కనే ఆనుకొని ఉన్న ఫర్టిలైజర్ గోదాంలో ఎరువులు విక్రయాలు జరుపుతామని, కార్యదర్శి ఎప్పటికప్పుడు వచ్చిస్టాక్ పొజిషన్, అమ్మ కాలు గురించి అడిగి లెక్కలు చునుకోవడం, అన్ని కరెక్ట్ ఉన్నాయని చెప్పడం జరుగుతుంది అన్నారు. మరి అట్లాంటప్పుడు తాను సొసైటీ కి 25 లక్షలు అప్పు ఎట్లా ఉంటానని ప్రభాకర్ గౌడ్ ప్రశ్నించారు. కార్యదర్శి తనపై అప్పు చూపడం సరైనది కాదని అయన స్పష్టం చేశా రు. కుర్నాపల్లి ఎరువుల విక్రయ కేంద్రం సేల్స్ మెన్ జగన్ మాట్లాడుతూ.. తాను 2లక్షల 18 వేలు వాడుకో లేదని, అదంతా అబద్ధమని అన్నారు. తనకే కార్యదర్శి ఒక లక్ష 25 వేలు ఇవ్వాల్సి ఉందని, నా వద్ద అప్పుడ ప్పుడు డబ్బులు తీసుకున్నాడని పేర్కొన్నారు. తన వద్ద తీసుకున్న డబ్బుల గురించి మార్చ్ ఏప్రిల్ అడిగితే రెండు నెలల తర్వాత ఇస్తానని కార్యదర్శి అందరి ముందర ఒప్పుకున్నాడని, అయితే తనకు డబ్బులు ఇవ్వకు ఆఫీస్ లో తాను కట్టేది ఉంది అవే డబ్బులు కట్టేయ్యమని చెబితే అప్పుడికి చూద్దాం అన్నారని అయన తెలిపారు. అలాగే సొసైటీ ద్వారా ఏరియర్స్ సుమారు 2 లక్షల వరకు రావాలి, అవి ఇవ్వండి అని అడిగితే ఇవ్వలేదని, అధికారులు కూడా చెప్పిన పట్టిం చుకోలేదని అన్నారు. అడిగిన డబ్బులు ఇవ్వకుండా మనసులో కక్ష పెట్టుకొని నీకేమైనా నేను బాకీ ఉన్నానా, నా సంతకం ఎక్కడైనా ఉందా బెదిరించారు అని ఆరో పించారు. అప్పు ఉన్నట్లు చూపి ఆరోపణలు చేయడం వల్ల, తన విలువ పోకుండా ఉద్యోగ భద్రత కోసం సొంత డబ్బులు తీసుకొచ్చి 2లక్షల 18 వేలు సొసైటీ లో కట్టిన ట్లు చెప్పారు. తనకు రావాల్సిన ఏరియర్స్ రాకుండా చేశాడని, ఇవ్వవల్సిన డబ్బులు ఇవ్వలేదని అయన తెలిపారు. తాను సొసైటీకి ఎటువంటి అప్పులేనని జగన్ స్పష్టం చేశారు. ఠాణాకలాన్ ఎరువులు విక్రయ కేంద్రం సేల్స్ మెన్ బాలు మాట్లాడుతూ.. తాను 2018 లో సొసైటీలో ఉద్యోగంలో చేరడం జరిగింది అని, అయితే గత ఛైర్మెన్ సాయికుమార్ యూరియా సంచు లు ఉద్దెర తీసుకెళ్లడం జరిగింది అని, డబ్బులు కట్టలే దని అన్నారు. ఆ డబ్బులు కట్టకపోవడం వల్ల అవి నాపై బాకీ కింద రాశారని, తెలిపారు. 20218 అక్టోబర్ లో ఆన్ లైన్ లో స్టాక్ క్లియర్ చేయలేదన్నాడు. అప్పటి డబ్బులు గత ఛైర్మన్ వాడుకోవడం జరిగింది అని, డబ్బులు వాడుకున్నట్లు లెటర్ ప్యాడ్ మీదా సంతకం పెట్టి ఇచ్చారని, ఆ స్టాక్ క్లియర్ చేయక పోవడం వల్ల అప్పటి రెండు మూడు లక్షలు నాపై పడ్డాయని, ఆ స్టాక్ తీసేసి 0 బ్యాలెన్స్ చేయాలని బాలు కోరారు. అప్పు ఉన్నట్లు నాపై కార్యదర్శి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని అయన స్పష్టం చేస్తూ వివరణ ఇచ్చారు.

# జానకంపేట ఫైరింగ్ కేంద్రంలో పోలీసు సిబ్బందికి ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహన : పోలీస్ కమీషనర్ వెల్లడి

గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, సమక్షంలో ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జానకంపేట వద్ద గల పోలీస్ ఫైరింగ్ కేంద్రంలో జిల్లా పోలీసు సిబ్బందికి ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది విధుల్లో భాగంగా వినియోగించే ఆయుధాలపై పూర్తి అవగాహన కలిగి ఉండేలా , ఆయుధాలను సురక్షితంగా మరియు సమర్థవంతంగా వినియోగించే విధంగా ప్రాక్టికల్ శిక్షణ అందించారు. సిబ్బంది నిర్ణీత లక్ష్యాలపై ఫైరింగ్ నిర్వహిస్తూ లక్ష్యసాధన , ఖచ్చితత్వం , ఏకాగ్రత , ఆయుధాల వినియోగ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నారు. అత్యవసర పరిస్థితులు , నేరస్తులపై చర్యలు , శాంతిభద్రతల పరిరక్షణ వంటి సందర్భాల్లో పోలీసులు తక్షణమే స్పందించాల్సి ఉంటుందని , అందుకు నిరంతర ఫైరింగ్ ప్రాక్టీస్ ఎంతో అవసరమని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. అదేవిధంగా ఆయుధాలను వినియోగించే సమయంలో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, క్రమశిక్షణతో వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి పోలీసు సిబ్బంది తమ ఫైరింగ్ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుని, విధి నిర్వహణలో మరింత సమర్థవంతంగా పనిచేసేలా సిద్ధంగా ఉండాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ (అడ్మిన్) శ్రీ ఎన్. శుభం ప్రకాష్ , నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, టాస్క్ ఫోర్స్ , సిటిసి , ట్రాఫిక్ , ఏ.ఆర్ , హోంగార్డ్స్ , ఐ.టి ఏసిపిలు , సిఐలు , ఎస్హెచ్ఓలు , పి.ఎస్.ఓ లు తదితరులు పాల్గొనడం జరిగింది.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com